ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
మంగళవారం 2 డిసెంబరు 2025




డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి



మత్తు పదార్థాల అనర్థాలపై సాలూరులో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

6



గంట్యాడ మండలం కొరారువిల్లి వద్ద నీటిలో వరి పనలు

అయ్యో అన్నదాత


● వర్షంలో తడుస్తున్న వరి పనలు
● సంరక్షించుకునేందుకు అవస్థలు పడుతున్న రైతులు
● విరామం లేకుండా కురుస్తున్న చిరుజల్లులు

విజయనగరం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): వరి పంట కోతలు చేపట్టిన రైతులు, కోతలు పూర్తయిన వారు తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వానకు కలవరపడుతున్నారు. చిరు జల్లులైనప్పటికీ విరామం లేకుండా కురుస్తుండడంతో పంట సంరక్షణ చేయలేకపోతున్నారు. తుఫాన్ తీరం దాటడంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి జిల్లాలో చిరుజల్లులు ప్రారంభమయ్యాయి. సోమవారం రోజంతా కురుస్తూనే ఉన్నాయి. ఇప్పటికే జిల్లాలో వరి కోతలు ముమ్మరంగా సాగుతు న్నాయి. ఈ చినుకులతో చాలా చోట్ల వరి పనలు తడిచిపోయాయి. దీంతో రైతులకు టెన్షన్ పట్టుకుంది. ధాన్యానికి మొలక వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వరి చేనుకుప్పలను సంరక్షించ డం, నూర్పుచేసిన ధాన్యాన్ని కల్లాల్లో సంరక్షించడం వంటివి చేస్తున్నారు. ఏటా వరి కోతల సమయంలో ఈ పరిస్థితి తప్పడం లేదు. గత నెలలో (మిగతా 8వ పేజీలో..)

భోగాపురం: వరి పనలను చూస్తూ దిగాలుగా మహిళా రైతు

తీరానికే పరిమితమైన మత్స్యకారులు

భోగాపురం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): వర్షాలకు భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లోని మత్స్యకారులు ఇంటికే పరిమితమయ్యారు. సోమవారం సాయంత్రానికి కూడా కెరటాలు ఉధృతంగా తీరాన్ని తాకుతుండడంతో ఇంకా ఎన్నిరోజులు ఉపాధి పోతుందోనని నిరాశ పడుతున్నారు. పడవలు, వలలు, వేట సామగ్రిని భద్రపరుచుకున్నారు. ఇంకొందరు వలలను బాగు చేసుకోవడం, ఇంజన్లను సరిచేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.





కాలుష్య కాటు

● కాలుష్యంతో మానవ జీవనానికి విఘాతం
● మేల్కొనకుంటే ముప్పే
● ముందు జాగ్రత్తలతోనే భవిష్యత్ విపత్తులకు చెక్
● నేడు జాతీయ కాలుష్య నివారణ దినం

కాలుష్యం.. ప్రజలందరినీ ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ప్రధాన కారకం. నివారణకు మానవ ప్రయత్నం జరుగుతున్నా అంతకు కొన్ని రెట్లు పెరుగుతోంది. వాయు, జల, భూమి కాలుష్యాలు ఎప్పుడో పరిమితిని మించిపోయాయి. జాతి భవిష్యత్‌ను అయోమయంలో పడేస్తున్నాయి. ప్రతి ఒక్కరూ మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైందని, కాలుష్య కారకాలకు దూరంగా జీవనం సాగించేందుకు ప్రయత్నం చేస్తే భవిష్యత్‌లో కరోనా లాంటి విపత్తుల ముప్పు నుంచి బయటపడ గలమని వైద్యులు, పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. మంగళవారం జాతీయ కాలుష్య నివారణ దినం పురస్కరించుకుని ప్రత్యేక కథనం.



రాజాం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):

పరిశుభ్రమైన గాలిని ఆస్వాదిస్తూ ఊపిరి పీల్చాలన్నా, సురక్షితమైన, రుచిగల నీరు తాగాలన్నా, భూమిపై ప్రశాంతంగా నివశించాలన్నా ఇదివరకటి రోజుల్లా ఇప్పుడు సాధ్యం కావడం లేదు. నగరాల్లో ఈ పరిస్థితి మరింత దారుణం. జలం గొంతు దిగుతుంటే కలవరపెడుతోంది. భూమిలో కరగని ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు ఆందోళనకు గురిచేస్తున్నాయి. వాయు కాలుష్యం రోజురోజుకూ ప్రమాదపుటంచులను తాకుతోంది. పర్యవసానంగా ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా లేకపోతే, బంగారు భవిష్యత్ కోసం తలో ప్రయత్నం చేయకపోతే జీవనానికే ముప్పు తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆ నగరాల జాబితాలో..

జిల్లాలో కూడా కాలుష్యం పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. నేషనల్ క్లీయర్ ఎయిర్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆ మధ్య 122 నగరాలను ఎంపిక చేసింది. అందులో విజయనగరం కూడా ఉండడం కలవర పెడుతోంది. పరిశ్రమలు ఎక్కువగా ఉన్న వీటి అగ్రహారం, జనాభా అధికంగా ఉన్న కస్పా ప్రాంతంలోని ఉన్నత పాఠశాల, బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లను ప్రత్యేకంగా గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ప్రతినెలా 9 రోజుల పాటు గాలిలో వాయు కాలుష్య పరిమాణాన్ని పరిశీలిస్తారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం రోజుకు మైక్రోగ్రామ్స్ పర్ క్యూబిక్ మీటర్ దాటకూడదు. ఏడాదిలో సరాసరి 60 కంటే తక్కువగా ఉండాలి కానీ జిల్లాలో అన్నిచోట్ల 75 నుంచి 77 శాతం ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

పెరుగుతున్న రుగ్మతలు

జిల్లాలో శ్వాసకోశ వ్యాధులు సైతం పెరుగుతున్నాయి. కాలుష్యమే వ్యాధులకు కారణమని వైద్యులు చెబుతున్నారు. వాతావరణంలో ఉండే సూక్ష్మ ధూళి, నైట్రోజన్, సల్ఫర్ డయాక్సైడ్, శబ్ద కాలుష్యంతో ప్రజలు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రధానంగా జిల్లాలో ఆస్తమా, బ్లడ్‌ప్రెజర్, గుండె సంబంధిత వ్యాధులు, ఊపిరితిత్తులు పనిచేయకపోవడం, లంగ్ కేన్సర్ వ్యాధులు క్రమేపీ పెరుగుతున్నాయి. కాలుష్య నివారణకు చర్యలు చేపట్టకపోతే మాత్రం భవిష్యత్‌లో మరింత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వాహన వినియోగంతో..

జిల్లాలో వాహనాల వినియోగం పెరిగింది. ఈ కారణంగానే (మిగతా 8వ పేజీలో..)

సంకల్పం సడలిందా?

● బొబ్బిలిలో ఎందుకిలా?

బొబ్బిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాలిథిన్ నిషేధాన్ని ఒకప్పుడు దిగ్విజ యంగా అమలు చేసిన బొబ్బిలి మునిసిపాలిటీలో నేడు ప్లాస్టిక్‌ను విరివిగా విని యోగిస్తున్నారు. కాలుష్య నియంత్రణలో ఎంతో పేరు సంపాదించిన మునిసిపాలిటీ ఇప్పుడు అందుకు భిన్నంగా తయారైంది. ఎక్కడికక్కడే ప్లాస్టిక్ ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఎందుకిలా? అని సగటు బొబ్బిలి పౌరుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

సుమారు దశాబ్దన్నరకాలంగా బొబ్బిలిలో పాలిథిన్ నిషేధాన్ని అమలు చేస్తున్నారు. అందుకు గతంలో కమిషనర్‌గా పనిచేసిన కరుణాకరం ప్రసాద్ పునాది వేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, సామాజిక సంస్థలు, విద్యాసంస్థల ప్రతినిధులను ఆయన సమన్వయం చేసుకుంటూ ప్రజలందరినీ పర్యావరణ హితంగా మెలిగేలా ప్రేరేపించి అద్భుతమైన విజయాలు సాధించారు. ఇంటింటి చెత్తసేకరణ, తడిచెత్త, పొడి చెత్త వేరుచేయడం, ఎరువుల తయారీ వంటి (మిగతా 8వ పేజీలో..)



బొబ్బిలి- పెంట రోడ్డులో చెత్తకుప్పలు

ఆక్రమణలను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

7లో

ఘనంగా గీతా జయంతి

7లో

పేదల సంక్షేమమే లక్ష్యం

● సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన ● మంత్రి కొండపల్లి శ్రీనివాస్
● పెదమానాపురంలో పింఛన్ల పంపిణీ



వృద్ధునికి పింఛను అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

దత్తిరాజేరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. పెదమానాపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సోమవారం పాల్గొన్న ఆయన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ యోగాక్షేమాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సమస్యలను అర్థం చేసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పింఛను మొత్తాన్ని రూ.4వేలకు పెంచారని గుర్తుచేశారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని, యువత పూర్తిగా నిర్వీర్యమయ్యారని, తప్పుదోవ పట్టించిన వ్యవస్థను ముఖ్య మంత్రి తన అపారమైన అనుభవంతో దారిన పెడుతున్నారని అన్నారు. ప్రతీ ధాన్యం గింజ కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వరిపంట వల్ల పెద్దగా రైతుకు (మిగతా 8వ పేజీలో..)

ఇంటింటికీ వెళ్లి..

● పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు
● సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం

6లో

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్ 6

చట్ట పరిధిలో పరిష్కరించండి

6 ● ఎస్పీ ఏఆర్ దామోదర్

నిబంధనల ప్రకారం ధాన్యం సేకరించండి

● ఏపీ రైతు సంఘం నాయకుల డిమాండ్ 7

కొత్తగా హెచ్ఐవీ కేసులు నమోదు కాకూడదు

అధికారులతో కలెక్టర్ రామసుందర్ రెడ్డి

7

ఆకస్మిక వరదపై నిర్లక్ష్యం



● ఇరిగేషన్ అధికారుల బాధ్యతా రాహిత్యంపై విమర్శలు
● స్వీయ అప్రమత్తతతో పలువురికి చంపావతిలో తప్పిన ముప్పు

మెంటాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చంపావతి నదికి ఆదివారం ఆకస్మిక వరద, ఆండ్ర జలాశయం నీటి విడుదలపై ఇరిగేషన్ అధికారులు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేయడం మండలంలో సంచలనమైంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడేలా వారి మాటలు ఉన్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండకపోతే నీటి పారుదల అధికారుల నిర్లక్ష్యానికి ప్రజలు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమౌతున్నది. ఆదివారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో చంపావతికి ఆకస్మిక వరదతో ఆ సమయంలో స్నానమాచరిస్తున్న భవానీ భక్తులతో పాటు నదిలో రాకపోకలు సాగిస్తున్నవారు, తీవ్ర భయాందోళనకు గురై ఒడ్డుకు పరుగులు తీశారు. ఈ ఘటనపై సోమవారం ఆంధ్రజ్యోతిలో 'చంపావతికి ఆకస్మిక వరద' శీర్షికతో వార్త ప్రచురితమైన సంగతి తెలిసిందే. నీటి విడుదలపై ఇరిగేషన్ ఈఈ కృపానంద్ పొంతన లేని ప్రకటన ఇచ్చిన విషయాన్ని కూడా పేర్కొన్న సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఎటువంటి ముందస్తు (మిగతా 8వ పేజీలో..)





మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి

ఎయిర్‌పోర్టులో మౌలిక సదుపాయాలు

● పనులు వేగంగా చేయండి ● కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): భోగాపురం అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో మౌలిక సదుపాయాలు కల్పించే పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. విమానాశ్రయానికి రోడ్లు, కాలువలు, విద్యుత్ తదితర వసతుల కల్పన, భూసేకరణ అంశాలపై సోమవారం సాయంత్రం తన చాంబర్‌లో కలెక్టర్ సమీక్షించారు. ఎయిర్‌పోర్టుకు నీటిని అందించేందుకు సుమారు రూ.20 కోట్లతో చేపట్టిన పనులపై ఆరా తీశారు. ఈ పథకానికి ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా కోసం సుమారు రూ.85 లక్షలతో ఏర్పాటు చేయనున్న విద్యుత్ లైన్లను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షం నీరు వెళ్లేందుకు వీలుగా దాదాపు రూ.27 కోట్లతో సుమారు 25 కిలోమీటర్ల మేర నాలుగు కెనాల్స్‌ను తవ్వాల్సి ఉందన్నారు. దీనికి అంచనాలు త్వరగా తయారు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అదే విధంగా సవరవల్లి -తూడెం గ్రామాల మధ్య 2.3 కిలోమీటర్ల మేర నిర్మాంచాల్సిన సీసీ రోడ్డు పనులకు వెంటనే అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. స్టాఫ్ క్వార్టర్లు, ఇతర అవసరాల కోసం చేపట్టాల్సిన భూసేకరణపైనా చర్చించారు. సమావేశంలో జేసీ సేతుమాధవన్, ఆర్డీవో కీర్తి, గ్రామీణ మంచి నీటి విభాగం ఎస్ఈ కవిత, ఏపీఈపీడీసీఎల్ లక్ష్మణరావు, ఇరిగేషన్ ఈఈ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'పండగ వాతావరణంలో మెగా పీటీఎంను నిర్వహిస్తాం'

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): 5న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం '(మెగా పేరెంట్స్ -టీచర్ మీటింగ్) పండగ వాతావరణంలో నిర్వహించనున్నామని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సారి సమావేశాలను అన్ని ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు (మిగతా 8వ పేజీలో..)

ఇంటింటికీ వెళ్లి

● పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు ● సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం

ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని లబ్ధిదారులకు తెలియజేశారు. సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారని వారు గుర్తు చేశారు.



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరమని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం వంతరాంలో పింఛన్లను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వంతరాం గ్రామ ప్రజలతో మాట్లాడుతూ వేగావతి నది నీరు గ్రామంలోకి రాకుండా అడ్డుకునేందుకు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ. 60 లక్షలు మంజూరు చేయించామన్నారు. గ్రామంలోని కస్తూర్బా విద్యాలయానికి రెండు భవనాల కోసం నిధులు మంజూరు చేశామన్నారు. గ్రామంలోని సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి నిధులు మంజూరుకు ప్రాధాన్యమిచ్చామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పెంకి వేణుగోపాలనాయుడు, వెంకటనాయుడు పాల్గొన్నారు.

పేదలను ఆదుకుంటున్న 'ఎన్టీఆర్ భరోసా'



భర్తాపురంలో పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛను పేదలను ఆర్థికంగా ఆదుకుంటోందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. సోమవారం కాపుసోంపురం, భవానీ నగర్, ఎస్.కోట బర్మాకాలనీల్లో గ్రామ సచివాలయ ఉద్యోగులతో పాటు ఇంటింటికి తిరిగి పింఛన్లను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని సమానంగా చూస్తోందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఒబ్బిన సత్యనారాయణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు డోకుల అచ్చంనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు జీఎస్‌నాయుడు, కొత్తవలస ఏఎంసీ డైరెక్టర్ తూర్పాటి అదిబాబు, నాయకులు ఇందుకూరి శ్రీనివాసరాజు, బీశెట్టి అరుణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి: ప్రభుత్వ విప్ జగదీశ్వరి



పింఛన్లు పంపిణీ చేస్తున్న జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి పాటుపడుతోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జగదీశ్వరి అన్నారు తాటికొండలో సోమవారం ఆమె ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అడ్డాకుల నరేష్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కడ్రక కళావతి, ఎస్టీ కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, ఎంపీడీవో లక్ష్మి, సర్పంచ్ జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లలో జాప్యం ఉండదు..



పింఛను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

రాజాం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రతినెల 1వ తేదీకే పింఛను అందిస్తున్నట్టు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. సోమవారం కొఠారిపురం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు కానుకగా అందించాలన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. సర్పంచ్ బట్న అసిరినాయుడు, ఎంపీడీవో జె.ఆనందరావు, డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, నాయకులు గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీను, వంగా వెంకటరావు, వల్లూరు గణేష్, గార గున్నంనాయుడు, ఏతః కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మా బాగున్నావా.. ఇదిగో మీ పింఛన్

● సూరంపేటలో పింఛన్లు పంపిణీ చేసిన మన్యం జిల్లా కలెక్టర్

సీతానగరం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): అమ్మా బాగున్నావా.. అయ్యా బాగున్నావా.. ఇదిగో మీ పింఛన్ అంటూ సోమవారం ఉదయం సూరంపేటలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి పంపిణీ చేశారు. వారి బాగోగులు తెలుసుకున్నారు. పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అందుకే ప్రతి నెలా లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి సామాజిక పింఛన్లను పంపిణీ చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, పలువురు మండల అధికారులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న మన్యం జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

తర్వాత పాత పనుకువలసలో నిర్మిస్తున్న ఎంఎస్ఎంఈ పార్క్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో గిరిజన సలహా మండలి సభ్యులు ఎం.తేజోవతి, సవర మాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు..



పింఛను అందజేస్తున్న బంగార్రాజు

భోగాపురం, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేలా చర్యలు చేపడుతున్నట్టు మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. రాజాపులోవ గ్రామంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యమన్నారు. మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో గాయత్రి, క్లస్టర్ ఇన్‌చార్జి దాసరి అప్పలస్వామి పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం: ఎమ్మెల్యే బేబీనాయన



కవిరాయునివలసలో ఫెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

తెర్లాం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటోందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. సోమవారం నెమలాం, కవిరాయునివలస తదితర గ్రామాలల్లో ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పింఛన్ మొత్తంతో వృద్ధులు, వికలాంగులు వితంతువులకు ఆర్థిక భరోసా కలుగుతోందన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం: ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



దేవనాపురంలో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట రూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. సోమవారం దేవనాపురంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం పెదరామ గ్రామానికి వెళ్లే మార్గంలో శిథిలావస్థలో ఉన్న వంతెనను ఆయన పరిశీలించారు. నూతన వంతెన నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

మాట నిలబెట్టుకున్న సీఎం..



పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల విషయంలో సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు అన్నారు. మండల పరిధి లోని గుండాలపేట, నగర పరిధి లోని 25వ డివిజన్ సున్నపు బట్టీవారి వీధిలో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సోమవారం పర్యటించారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. టీడీపీ నాయకులు గంటా రవి, గంటా పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గజపతినగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఐటీఐ, పాలిటెక్నిక్ పూర్తి చేసిన యువతీ, యువకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ అనేక కంపెనీలను రాష్ట్రానికి తీసుకు వస్తున్నారని తెలిపారు. ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా బ్లూకలర్ ఉద్యోగాలకు మంచి డిమాండ్ ఉందన్నారు. హైదరాబాద్, భువనేశ్వర్ ప్రాంతాల్లో ఉన్న సంస్థలతో మాట్లాడి ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఇంటర్వ్యూలలో తప్పిన యువతకు మరో అవకాశం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. స్టీల్‌ప్లాంట్‌తో పాటు, బొండపల్లి, గజపతినగరం మండలాల్లో ఎంఎస్ ఎంఈ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. మరుపల్లిలో మూతపడిన ఓలమ్ కంపెనీని తెరిపించే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి.వి.వి.గోపాలరాజు, పీఏసీఎస్ చైర్మన్ లెంక బంగారునాయుడు, జనసేన పార్టీ నాయకులు మర్రాపు సురేష్, గజపతినగరం, దత్తిరాజేరు మండల పార్టీ అధ్యక్షులు గంట్యాడ శ్రీదేవి, చప్పా చంద్రశేఖర్, మాజీ జెడ్పీటీసీ మక్కువ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించండి

● ఎస్పీ ఏఆర్ దామోదర్



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

విజయనగరం క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫిర్యాదుదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి.. 24 ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో భూతగాదాలకు సంబంధించి 9, కుటుంబ కలహాలకు సంబంధించి 4, నగదు వ్యవహారాలకు సంబంధించి 2, మోసాలకు సంబంధించి 2, ఇతర అంశాలకు సంబంధించి 7 ఫిర్యాదులు ఉన్నాయి. ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలపై విచారణ చేసి.. వాస్తవాలు గుర్తించి, చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏడు రోజుల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో పోలీసు కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, సీఐలు ఏవీ లీలారావు, కుమారస్వామి, అంబేడ్కర్, ఎస్ఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై వినతులు స్వీకరిస్తున్న మన్యం జిల్లా కలెక్టర్

అర్జీదారుల సంతృప్తే ప్రథమ కర్తవ్యం

● కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ● పీజీఆర్ఎస్‌కు 69 వినతులు

పార్వతీపురం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): అర్జీదారుల సంతృప్తే ప్రథమ కర్తవ్యంగా భావించి అధికారులు అర్జీల పరిష్కారానికి చూపాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 69 వినతులను ఆయన స్వీకరించారు. గుమ్మలక్ష్మీపురం మండలం వనకబడి గ్రామంలో సాగు చేసుకుంటున్న కొండ పోడు భూములకు ఆధార్ లింక్ చేయాలని జె.జానకితో పాటు పలువురు వినతిపత్రం అందజేశారు. బలిజిపేట మండలం మురగడాం గ్రామ రెవెన్యూ పరిధిలోని వ్యవసాయ భూముల్లో ఆక్రమణలు తొలగించాలని వెంకటరావు కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. పార్వతీపురం మున్సిపాలిటీలో సౌందర్య థియేటర్ బైపాస్ రోడ్డులో ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్ నెంబరు 27, లే అవుట్ నెంబర్ 296/2019లో సీలో ఉన్న ఇంటిస్థలాన్ని చూపించాలని పార్వతీపురం పట్టణానికి చెందిన బి.స్వప్నసుధ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చిరుజల్లులతో వణుకు

● నీటిలోనే వరి పంట ● చేతికి అందే సమయంలో కష్టం ● రైతుకు తీరని నష్టం

తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఆదివారం రాత్రి నుంచి చిరుజల్లులు కురుస్తున్నాయి. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో కోత కోసిన వరి పంట నీట మునిగింది. కొన్నిచోట్ల నూర్పులకు సిద్ధం చేసిన పంట కూడా దెబ్బతింది. పంటను కాపాడుకోవడానికి రైతులు అనేక ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండాపోయింది. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వమే చర్యలు చేపట్టాలని అన్నదాతలు కోరుతున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



గరుగుబిల్లి: మరుపెంటలో ధాన్యం నిల్వలపై టార్పాలిన్లు



పాలకొండ: కుప్పలపై టార్పాలిన్లు



భోగాపురం: వర్షపునీటిలో కోసిన వరి పంట



బొబ్బిలి రూరల్: సీహెచ్ బొడ్డవలసలో వరిచేను కుప్పలు వేస్తున్న కూలీలు



గజపతినగరం: కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట



మెరకముడిదాం: పొలాల్లో కుప్పలు వేసిన వరి పంట



గజపతినగరం: ధాన్యంపై గడ్డి, టార్పాలిన్లు కప్పుతున్న రైతులు



వీరఘట్టం: కడకెల్లలో కోతకు సిద్ధంగా వరి పంట



గంట్యాడ: నరవలో తడిసిన వరిని ఆరబెడుతున్న రైతులు

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

● రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



స్వయంగా సైకిల్ తొక్కుతూ ర్యాలీలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. పట్టణంలో సోమవారం ఈగల్ టీం సభ్యులు అభ్యుదయం పేరిట సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సైకిల్ యాత్రను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం ప్రారంభించారు. సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి డీలక్స్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. మంత్రి స్వయంగా సైకిల్ తొక్కుతూ యువతను ఉత్తేజ పరిచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో గంజాయి సాగును పూర్తిగా అరికట్టిందన్నారు. ఏజెన్సీలో కాఫీ సాగు ను విస్తృతంగా ప్రోత్సహిస్తోందన్నారు. యువత డ్రగ్స్ బారినపడి బంగారు భవిష్యత్ పాడుచేసుకోవద్దన్నా రు. ఇప్పటికే గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం మోపామన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు కృషి చే స్తోందన్నారు. ఇందులో భాగంగా కళాశాలలు, పాఠశాలల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టీ ఆదేశాల మేరకు 27 మంది ఈగల్ టీం పాయకరావుపేట నుంచి ఇచ్ఛాపురం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించి మత్తు పదార్థాలపై యువతను అప్రమత్తం చేశామన్నారు. ప్రపంచంలో 21 కోట్ల మంది మాదకద్రవ్యా లను వినియోగిస్తుండగా ఒక్క భారతదేశంలో 10 కోట్ల మంది గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటు పడటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలు, బ్యాండ్‌తో అభ్యుదయం ర్యాలీకి స్వాగతం పలికారు. డీఎస్పీ రాంబాబు, సీఐలు అప్పలనాయుడు, రామకృష్ణ, శ్రీనివాసరావు, క్రాంతికుమార్‌తో పాటు టీడీపీ నాయకులు నిమ్మాది తిరుపతిరా వు, కేతిరెడ్డి చంద్రశేఖర్, యుగంధర్, కిలారి రవి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ధాన్యం సేకరించండి

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారం జిల్లాలో ధాన్యం సేకరించాలని... తేమ శాతం పేరిట రైతుల నుంచి మిల్లర్లు అదనంగా ఐదు కేజీలు తీసుకునే ప్రక్రియను అరికట్టాలని ఏపీ రైతు సంఘం నాయకులు బి.రాంబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. తేమ శాతం ఎక్కువ ఉందని రైతుల నుంచి మిల్లర్లు అదనపు ధాన్యం తీసుకుంటున్నారని ఆరోపించారు. వెంటనే దీనిని నిలుపుదల చేయాలన్నారు. సిబ్బంది ద్వారా ధాన్యం మిల్లులకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాజాం మండలంలోని రైతులకు నాసిరకం వరి విత్తనాలు ఇవ్వడంతో తీవ్రంగా నష్టపోయారని, వెంటనే సంబంధిత కంపెనీ డీలర్లపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు ఎల్.ఆదినారాయణ , గొంపా కృష్ణమూర్తి, గుల్లుపల్లి గుంగునాయుడు పాల్గొన్నారు.

భోజన పథకం నిర్వాహకుల నిరసన

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గ్యాస్ ఇవ్వకుండా స్టౌపై వంట చేయమనడం సరికాదన్నారు. ఉచిత గ్యాస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకురాలు బొత్స సుధారాణి, సభ్యులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘ నాయకులు

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి

విజయనగరం పట్టణంలో ఉన్న నిరుపేదలు అందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ ఎంఎల్ నాయకులు డిమాండ్ చేశారు. సంఘ నాయకులు అప్పలరాజు మాట్లాడుతూ ఇళ్లు లేని నిరుపేదలు సచివాలయాల్లో దరఖాస్తు చేసినా ఆన్‌లైన్‌లో సర్వర్ సమస్య ఉందంటూ సిబ్బంది కుంటిసాకులు చెబుతున్నారని ఆరోపించారు. అర్హులైన వారందరికీ స్థలాలు మంజూరు చేయాలని కోరారు. లేని పక్షంలో పోరాటం చేస్తామన్నారు.

ఇళ్ల నిర్మాణం పూర్తి చేయండి

గత ప్రభుత్వ హయాంలో బలహీన వర్గాల వారి కోసం కేటాయించిన కాలనీల్లో ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమస్యను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని సంఘ నాయకులు కోరారు.

పీజీఆర్ఎస్‌లో భారీగా వినతులు

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ (మీకోసం)లో వివిధ సమస్యలపై 203 వినతులు వచ్చాయి. కలెక్టర్ రామసుందర్ రెడ్డి, జేసీ సేతు మాధవన్, డిప్యూటీ కలెక్టర్లు వినతులు స్వీకరించారు. ఇందులో రెవెన్యూ శాఖకు సంబందించి 73 వినతులు, డీఆర్‌డీఏకు 32, సచివాలయ శాఖకు 12, మున్సిపల్ శాఖ 6, విద్యా శాఖకు 3, పంచాయతీరాజ్ ఒక వినతి వచ్చాయి. విద్యుత్ శాఖకు, హౌసింగ్‌కు 7చొప్పున, పంచాయతీరాజ్‌కు 13, ఇతర శాఖల నుంచి 50 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రామసుందర్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు అర్జీదారులతో కలిసి మాట్లాడి తర్వాతనే ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్ టోల్ ఫ్రీ నెంబరు 1100పై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

మెగా జాబ్‌మేళాను వినియోగించుకోండి


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

రాజాం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీఎంఆర్ఐటీ ప్రాంగణంలో ఈ నెల 6న మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జాబ్‌మేళా బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 సంస్థల ప్రతినిధులు హాజరవుతారని, 2500 వరకు ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని కోండ్రు వివరించారు. నిరుద్యోగ యువతీ, యువకులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో జాబ్ మేళాకు హాజరై ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, గురవాన నారాయణరావు, వంగా వెంకటరావు, దుప్పలపూడి శ్రీను, గార గున్నంనాయుడు, పొన్నాడ భీమేశ్వరరావు, మద్దు హరి, బట్న సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

లక్కవరపుకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్జాం గ్రామ రెవెన్యూ సర్వే నెంబరు-99 వాగును గొల్జాం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే దానిని రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. సోమవారం ఆర్ఐ సన్యాసిరావు, వీఆర్వో గోవింద జేసీబీతో వాగులో వేసిన మట్టిని తొలగించారు. గ్రామంలో పలుకుబడి ఉన్న ఓ వ్యక్తి దందాను కొనసాగించేందుకు కృషి చేయగా గ్రామ పెద్దలు రెవెన్యూ శాఖ దృష్టికి తీసుకువచ్చారని, వెంటనే సిబ్బంది స్పందించి కబ్జాదారుని నుంచి వాగును కాపాడామని తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు తెలిపారు ఇకపై ఎవరైనా వాగులు, గెడ్డలు కబ్జా చేస్తే క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు.


వాగులో మట్టిని తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

భూములు ఇచ్చేయండి


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

శృంగవరపుకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'ఆర్ ఆర్ ప్యాకేజీలో ఇచ్చిన హామీ ప్రకారం మా వాటాలైనా మాకు ఇవ్వండి.. లేదంటే తిరిగి మా భూములైనా ఇచ్చేయండి' అంటూ జిందాల్ భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ గ్రీవెన్స్‌లో సోమవారం వినతిపత్రాలు అందించారు. 171 రోజులుగా బొడ్డవరలో జిందాల్ పరిశ్రమ యాజమాన్యం తీరుకు వ్యతిరేకంగా భూ నిర్వాసితులు ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. భూమి విలువకు సమానమైన కంపెనీ షేర్లు కేటాయించడం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనం కల్పిస్తున్నామని హామీ అప్పట్లో హామీ ఇచ్చారని తెలిపారు. ఈనమ్మకంతోనే భూములను ఇచ్చామన్నారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని తెలిపారు. ఏపీ రైతు సంఘం నాయకుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో బొడ్డవరలోనూ నిరసన తెలిపారు.

సదుపాయాల కల్పనకు కృషి



మాట్లాడుతున్న సువ్వాడ రవిశేఖర్

నెల్లిమర్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని టీడీపీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. టీడీపీ మండల కమిటీ అధ్యక్షుడు కడగల ఆనందకుమార్‌తో కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సోమవారం సందర్శించారు. ప్రిన్సిపాల్ రేఖతోను, అధ్యాపకులతో ను మాట్లాడారు. కళాశాల భవన సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో జరిగిన ఎయిడ్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవిశేఖర్, ఆనంద్‌కుమార్‌లు మాట్లాడుతూ ఏడాదిలోగా డిగ్రీ కళాశాలకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని అన్నారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రేఖ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, నాయకుడు అవనాపు సత్యనారాయణ, అధ్యాపకులు కర్రోతు శ్రీనివాస్, జైపాల్, అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఘనంగా గీతా జయంతి వేడుకలు


నాట్యం చేస్తున్న చిన్నారులు

రాజాం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గీతాజయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి ఓ కార్యాలయంలో బాల సంస్కార కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.స్వప్నహైందవి మాట్లాడుతూ.. పిల్లలు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో మెలగాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శెట్టి శ్రీనివాసరావు, టీటీవీ రమణమూర్తి, కొత్తా మదుసూధనరావు, డా.సామంతుల శరత్‌కుమార్, వాకచర్ల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పట్టణంలోని రమణసత్యానంద నిలయంలో దేవాదాయశాఖ ఈఓ బలివాడ మాధవరావు ఆధ్వర్యంలో గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. అర్చకులు వాన ప్రసాదరావు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో...

శృంగవరపుకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం గీతా జయంతి వేడుకలు జరిగాయి. భగవద్గీత చదవడం ద్వారా మనోధైర్యాన్ని పొందవచ్చునని సెంటర్ ఫర్ యోగా, మెడిటేషన్ (సీమ్) వ్యవస్థాపకుడు, న్యాయవాది బి.రామకృష్ణ తెలిపారు. ప్రతి మూడు నెలలకు గీతా పఠనం పోటీల నిర్వహణకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన గీతా పోటీలలో 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు.

కొత్తగా హెచ్‌ఐవీ కేసులు నమోదు కాకూడదు



గజపతినగరం: మాట్లాడుతున్న న్యాయాధికారి విజయ్‌రాజ్‌కుమార్


కొత్తవలస: మాట్లాడుతున్న న్యాయాధికారి విజయ్ చందర్

విజయనగరం కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇకపై కొత్తగా హెచ్‌ఐవీ కేసులు నమోదు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రామసుందర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక ఐఎంఏ హాలులో అవగాహన కార్యక్రమం నిర్వహించి బాధితులతో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్‌ఐవీ స్థితిని తెలుసుకుని జాగ్రత్త పడాలని సూచించారు. సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ బాధితులకు న్యాయపరంగా సమస్యలు ఉంటే జిల్లా లీగల్ సెల్ ద్వారా న్యాయం చేస్తామని తెలిపారు. అనంతరం హెచ్‌ఐవీ బాధితులు, చిన్నారులు సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి కలెక్టర్ ప్రశంసాపత్రాలను, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో. జిల్లా వైద్యాధికారి జీవన రాణి, జైళ్ల శాఖ అధికారి మధుబాబు, జిల్లా ఎయిడ్స్ క్షయ నియంత్రణాధికారి రాణి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించండి..

గజపతినగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ నియంత్రణపై అవగాహన కల్పించాలని న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం జాతీయ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా స్థానిక కోర్టు ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ హెచ్‌ఐవీ నియంత్రణకు వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యావంతులు గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం జాతీయ రహదారి నుంచి కోర్టు వరకు అవగాహన ర్యాలీ చే పట్టారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు చంద్రశేఖర్, జె.జగదీష్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నిరోధానికి ప్రయత్నించండి

కొత్తవలస, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ-ఎయిడ్స్ లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొత్తవలస న్యాయాధికారి డాక్టర్ సముద్రాల విజయ్ చందర్ అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో ఎయిడ్స్ డే సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి ఎయిడ్స్‌ను అంతం చేయాలన్నారు. హెచ్‌ఐవీతో జీవిస్తున్నవారిపై వివక్ష చూపవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి సీతా మహాలక్ష్మి, ఎన్జీవో సంఘం అధ్యక్షుడు జేవీ ప్రసాదరావు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

డిప్యూటీ ఎంపీడీవోగా రాజ్‌కుమార్

డెంకాడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ డిప్యూటీ ఎంపీడీవోగా కర్రోతు రాజ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అదే కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో వై.భవాని సంబంధిత ఉత్తర్వులను ఆయనకు అందజేశారు. ఆయనను అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వై.దేవానంద్, డిప్యూటీ ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, సిబ్బంది అభినందించారు.

నేటి నుంచి మహా మంత్ర సప్తాహం

సంతకవిటి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి); మండల కేంద్రంలోని అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం నుంచి మహా మంత్ర సప్తాహం ప్రారంభం కానుంది. ఏడు రోజుల పాటు రేయింబవళ్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఏడు రోజులు నిత్యం మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

పింఛన్లు పేదలకు వరం

నెల్లిమర్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరమని టీడీపీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్ అన్నారు. గొర్లిపేట గ్రామంలో నూతనంగా మంజూరైన పించన్లను లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లెంక అప్పలనాయుడు, నాయ కులు కోటపాటి తిరుపతిరావు, తాడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లో రుణ సదుపాయం

కొత్తవలస, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస పీఏసీఎస్ పరిధిలో ఉన్న రైతులకు రుణాలను ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నటు అధ్యక్షుడు కోళ్ల వెంకట రమణ తెలిపారు. ఒక ఎకరం వ్యవసాయ భూమి ఉంటే రూ.50 వేల వరకు రుణం పొందే వీలుందన్నారు. అవసరమైన రైతులు పీఏసీఎస్ కార్యదర్శిని కలసి రుణాలు పొందవచ్చని తెలిపారు.

విద్యార్థుల నిజాయితీ


బాధితునికి నగదు, సెల్‌ఫోన్‌ను అందిస్తున్న విద్యార్థులు

శృంగవరపుకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఓ పాఠశాలలో చదువుతున్న బి.కృషికేష్, లాస్యశ్రీలు నిజాయితీని చాటుకున్నారు. తమకు దొరికిన రూ.25వేల నగదుతో పాటు కొత్త సెల్‌ఫోన్‌ను పోలీసు స్టేషన్‌కు అందించారని వారి తండ్రి, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ తెలిపారు. వీటిని పోగొట్టుకున్న శీశెట్టి స్వామినాయుడుకు సోమవారం పోలీసు స్టేషన్‌లో అప్పగించారని తెలిపారు. ఈ విద్యార్థులను సీఐ నారాయణమూర్తి, ఎస్.ఐ. సత్యానారాయణ, ఏఎస్ఐ గోవిందరావు, కానిస్టేబుల్ పాపారావులు అభినందించారు.

దుప్పట్ల పంపిణీ

రాజాం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాజాం టౌన్ సి.ఐ. కె.అశోక్‌కుమార్ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల బాలికల వసతిగృహాన్ని సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థినులు సరైన దుప్పట్లు లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. వసతిగృహంలో సోమవారం రాత్రి తన సొంత నిధులతో 50 మంది విద్యార్థినులకు ఒక్కో రగ్గు, ఒక్కో దుప్పటి వంతున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువు కోవాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

లక్కవరపుకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గొల్జాం-1, 3, కల్లెంపూడి అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీవో ఆర్.రమాదేవి సోమవారం తనిఖీ చేశారు. కార్యకర్తలు సమయపాలన పాటిస్తున్నారో లేదోనని పరిశీలించారు. గొల్జాంలో కాన్వెంట్లకు వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి ప్రీస్కూల్ విద్యార్థులు పెరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీబాయి పాల్గొన్నారు.

మామిడి సాగుపై శిక్షణ

గంట్యాడ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గొడియాడ గ్రామానికి చెందిన రైతులకు మామిడి సాగుపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేవీకే రస్తా కుంటబాయి నుంచి వచ్చిన శాస్త్రవేత్త శ్రీనివాసరాజు రైతులకు మామిడి పంట సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారి స్వాతి, రైతులు పాల్గొన్నారు.

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్- ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

క్రైం న్యూస్

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి అపరాధ రుసుం

రేగిడి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో రేగిడి, పాలకొండ మండలాలకు చెందిన ముగ్గురికి రాజాం మెజిస్ట్రేట్ కె.నైమిష అపరాధ రుసుం విధించినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో రేగిడి ఆమదాలవలసకు చెందిన గేదెల నారాయణరావు, తేగల లక్ష్మణరావు, పాలకొండకు చెందిన సంభాన సత్యనారాయణలు పట్టుబడ్డారని తెలిపారు. రాజాం కోర్టు నారాయణరావుకు రూ.5 వేలు. తేగల లక్ష్మణరావుకు రూ.25వేలు, సత్యనారాయణకు రూ.6 వేలు అపరాధ రుసుం విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

పూసపాటిరేగలో...

పూసపాటిరేగ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత వారం రోజులుగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారితో పాటు మద్యం తాగి వాహనాలను నడిపిన వారిపై పోలీసులు కేసులు నమోదుచేశారు. వీరికి జడ్జి శ్రీవిద జరిమానా విధించినట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 23మందికి రూ.500 చొప్పున, మద్యం తాగి... వాహనాలు నడిపిన నలుగురికి 10వేల చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ

లక్కవరపుకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో విశాఖ-అరకు రహదారిలో ఎల్.కోట పోలీసులు సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ నవీన్‌పడాల్ ఆధ్వర్యంలో సిబ్బంది మొత్తం వాహనాలను తనిఖీ చేశారు. గంజాయి రవాణా, అక్రమ మద్యం, డ్రంక్ అండ్ డ్రైవ్‌అనర్థాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు.

అక్రమ కబేళాలను మూసివేయాలి

విజయనగరం బాబామెట్ట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కంటోన్మెంట్‌లో అక్రమంగా నడుపుతున్న పశుమాంసం కబేళాలను మూసివేయాలని గో సంరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్యను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కబేళాలు మూసివేయించాలని లేని పక్షంలో నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు సంధ్యారాణి, సత్యనారాయణ, పైడితల్లి, రేణుక పాల్గొన్నారు.

శతశాతం పింఛన్ల పంపిణీ

విజయనగరం టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఉన్న 60 డివిజన్లలో సోమవారం ఒక్కరోజే శతశాతం పింఛన్లు పంపిణీ చేశామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. సోమవారం తోటపాలెం, బాలాజీనగర్, కణపాక తదితర ప్రాంతాలలో ఎన్టీఆర్ భరోసా పించన్ల పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది పనితీరు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో ఏఎస్ఐకి బంగారు పతకాలు

విజయనగరం క్రైం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విజయనగరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న ఆల్తి త్రినాథ్‌రావు విశాఖలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రెండు విభాగాల్లో బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గతంలో గాజువాకలో నిర్వహించిన పోటీల్లో రెండు పతకాలు, కేరళ రాష్ట్రం ఎర్నాకుళంలో జరిగిన పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించారు. నేపాల్‌లో అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనబోతున్నారు. ఏఎస్ఐ త్రినాథ్‌రావు సోమవారం ఎస్పీ దామోదర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఎస్పీ ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ ఆర్‌వీఆర్‌కే చౌదరి పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించండి

గజపతినగరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు బకాయి ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు వి.లక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లతో కలసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు నుంచి ఐదు నెలల వరకు వేతన బకాయిలు ఉన్నాయని తెలిపారు. అనంతరం ఎంపీడీవో బి.కల్యాణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కె.రాము, కె.అప్పారావు, దినకర్, అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

కిసాన్‌మోర్చా అధ్యక్షుడిగా లోకాభిరామకోటి

శృంగవరపుకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడిగా శివరామరాజుపేటకు చెందిన కొట్యాడ లోకాభిరామకోటిని నియమించారు. ఈ మేరకు సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్ వర్మ నియామక పత్రం అందించారు. నాయకులు సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్, అప్పారావు, మరసాశ్రీను ఆయనను అభినందించారు.

కరాటేలో ప్రథమ బహుమతి

కొత్తవలస, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వియ్యంపేట జడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న అసిరాడ మోహన్ ప్రకాష్ జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలలో ప్రథమ బహుమతి సాధించాడు. ఆదివారం రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జాతీయ స్థాయి కరాటే చాంపియన్‌షిప్ 2.0 పోటీలు జరిగినట్టు హెచ్‌ఎం గోవిందరాజు తెలిపారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS
ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి
అచిరకాలంలో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా! అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లలో ఏ నెంబరుకైనా ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
ఫోన్ నెంబర్లు: ACM : 99854 11514
ACO : 99854 11533
Office : 08942 - 281995

కావలెను
★విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నూతనంగా 3 వెంచర్లు మార్కెటింగ్ చేయుటకు ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో పని చేయుటకు అనుభవం ఉన్న మార్కెటింగ్ లీడర్లు, యువతీ యువకులు, టెలీకాలర్లు, కారు డ్రైవర్లు కావలెను. ఇతర వివరాలకు సంప్రదించండి: 8688796746
AJS-243973

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నష్టపోయిన/క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు:
9985411522, 9985479944, 9985406982, 9440567403, 9985489266

ఆకస్మిక వరదపై నిర్లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)

సమాచారం లేకుండా అంద్ర రిజర్వాయర్ నీటి విడుదలపై ఇరిగేషన్ డీఈ ఆర్.రామునాయుడు సోమవారం ప్రకటన ఇచ్చారు. దీనిపై నదీ తీర ప్రాంత సర్పంచ్‌లు భగ్గుమంటున్నారు. ఎగువ నుంచి వరదనీరు రిజర్వాయర్‌లోకి రావడంతో వచ్చిన నీటిని వచ్చినట్టుగా గత నెల 29 (మూడు రోజుల క్రితం)న మధ్యాహ్నం 3 గంటల సమయంలో విడుదల చేస్తున్నట్టు... ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సతీష్‌తో సహా నదీ తీరాల గ్రామాలైన లోతుగెడ్డ, అంద్ర, జగన్నాథపురం, మర్రివలస సర్పంచ్‌లకు సమాచారం ఇచ్చినట్టు అందులో పేర్కొన్నారు. నీటి విడుదల కారణంగా ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లలేదని అందులో పేర్కొన్నారు. డీఈ ప్రకటనపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు 'ఆంధ్రజ్యోతి' వద్ద తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. డీఈ నుంచి కాని, ఆ శాఖాధికారుల నుంచి తమకెటువంటి సమాచారం లేదని స్పష్టం చేశారు.

ఈ ప్రశ్నలకు బదులేదీ?

ఆదివారం రాత్రి ఇరిగేషన్ ఏఈ కృపానంద్ ప్రకటన గందరగోళంగా మారింది. నీటి విడుదల పై స్పష్టత లేదు. ముందస్తు హెచ్చరికలపై నీళ్లు నమిలారు. డీఈ రామునాయుడు మాత్రం సర్పంచ్‌లకు తెలియజేశాక శనివారం నీటిని విడుదల చేశామని స్పష్టం చేశారు. శనివారం విడుదల చేస్తే, ఆరేడు కిలోమీటర్లు దూరంలో వున్న మెంటాడ, రెల్లిగూడేం గ్రామాలకు నీరు చేరేందుకు 28 గంటల సమయం పడుతుందా? అన్న విషయం అధికారులకే తెలియాలి. మండల పరిధిలో ఏడు నదీ తీర గ్రామాలుండగా, నాలుగు గ్రామాల సర్పంచ్‌లకే సమాచారం ఇవ్వడంలో అంతర్యం ఏమిటో వారికే తెలియాలి.

అలారం, దండోరా ఎక్కడ

ముందస్తు హెచ్చరికల కంటే ఫోన్ ద్వారా సమాచారంతో పాటు రిజర్వాయర్ వద్ద అలారం మోగించడం ప్రభావిత గ్రామాల్లో దండోరా వేయించడం వంటివి చేయాలి. అవి ఏవీ కన్పించలేదు. తహశీల్దారు, ఎస్ఐకి కూడా సమాచారం లేదు.

కనీస సమాచారం లేదు

అంద్ర రిజర్వాయర్ నుంచి వరద నీరు విడుదలపై ఇరిగేషన్ అధికారుల నుంచి కనీస సమాచారం లేదు. సాయంత్రం 4 గంటల నుంచి నదిలో నీటి మట్టం క్రమక్రమంగా పెరగడంతో తుఫాను వల్ల ఎగువ వర్షాల ప్రభావేమోనని జాగ్రత్త పడ్డారు. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే, భారీ ప్రమాదమే జరిగింది.

- ఎస్.భీమారావు, సర్పంచ్, లోతుగెడ్డ

ఫోన్ లేదు.. మెసేజ్ లేదు

నీటి విడుదలకు సంబంధించి ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. ఫోన్ చేయలేదు సరికదా.. మేసేజ్ కూడా లేదు. ఆకస్మికంగా నది ఉధృతి పెరిగి ఈ మధ్యనే ఒకరు జల సమాధి అయ్యారు. అధికారులు ఇలా చేస్తే, ఎలా...

- వాకపల్లి లక్ష్మీ, సర్పంచ్, అంద్ర

ఆదివారం రాత్రి ఫోన్ చేశారు

ఆదివారం రాత్రి 10.22 కి ఇరిగేషన్ అధికారులు ఫోన్ చేసి అంద్ర నీరు విడుదల చేస్తున్నామని చెప్పారు. అప్పటికే నీటి మట్టం పెరగడం చూశాం. ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేసిన తరువాత సమాచారం ఇచ్చినట్టుంది. ఆదివారం సాయంత్రం 4 గంటలకే నీటి మట్టం పెరిగిందని చెప్పాను. దీనిని వారు పట్టించుకోలేదు.

- అర్జునరావు, సర్పంచ్, మర్రివలస

అలా ఎందుకు చెప్పారో?

ఇరిగేషన్ డీఈ రామునాయుడు శనివారం మధ్యాహ్నం నీరు విడుదల చేసినట్టు చెప్పుకురాగా, తమకు తెలియదని అంద్ర, లోతుగెడ్డ సర్పంచ్‌లు తెలిపారు. ఆదివారం రాత్రి 10 గంటల తరువాత నీరు విడుదల చేస్తామని ఇరిగేషన్ ఏఈ ఫోన్ చేశారని స్పష్టం చేశారు. ఆకస్మిక వరద విషయాన్ని ఆంధ్రజ్యోతి ప్రతినిధి రాత్రి 8 గంటల సమయంలో స్థానిక తహసీల్దారు అరుణకుమారి, ఎస్ఐ సీతారాం దృష్టికి తీసుకువెళ్లిన నేపథ్యంలో ఇరిగేషన్ అధికారుల్లో కలకలం రేపినట్టు సమాచారం.

అయ్యో అన్నదాత

(ఐదో పేజీ తరువాయి)

మొంథా తుఫాన్ కూడా అన్నదాతలను కలవరపెట్టింది. అప్పట్లో భారీ వర్షాలు పడినా ఈదురుగాలులు లేవు. ఆపై పంట పక్వానికి వచ్చే సమయం కావడంతో పెద్దగా ఇబ్బందులు లేవు. ఇప్పుడు సరిగ్గా వరి కోత లు, నూర్పుల సమయం. చిరుజల్లులే అయినా నష్టం తెచ్చేలా ఉన్నాయని భయపడుతున్నారు.

- విజయనగరం సమీపంలోని నరవ, రామవరం, కొర్లాం, తామరపల్లి, కొరారుబిల్లి తదితర ప్రాంతాల్లో వరి పంట సంరక్షణ ఇబ్బందికరంగా మారింది. రైతులు రోడ్లపై పనలను ఆరబెట్టడం కనిపించింది. మరోవైపు ఆశించిన స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో కళ్లాల్లో ఉంచిన ధాన్యాన్ని రైతులు విక్రయించు కోలేకపోతున్నారు.

మెగా పీటీఎంను నిర్వహిస్తాం

(ఐదో పేజీ తరువాయి)

విద్యార్థుల తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో పాల్గొనేలా ప్రత్యేక ఆహ్వానాలు పంపుతామని చెప్పారు. ఉదయం 9 నుంచి 12.45 వరకూ సమావేశం జరుగుతుందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 1771 పాఠశాలలు, 67 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు పని చేస్తున్నాయని తెలిపారు. సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు, లక్షన్నర మంది పేరెంట్స్, మరో 50వేలు మంది అతిథులు పాల్గొంటారని కలెక్టరు వివరించారు. కార్యక్రమంలో డీఈవో మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టరు రామారావు తదితరులు ఉన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)

గిట్టుబాటు రావడం లేదని, అందువల్ల ఉద్యానపంటలవైపు రైతులు మొగ్గుచూపాలని మంత్రి కోరారు. మానాపురం వద్ద అండర్ బ్రిడ్జి నిర్మించాలని రైతులు కొంతమంది కోరగా దీనికి సంబంధించి అధికారులు పరిశీలించారని, పూర్తి నివేదిక సేకరించి తగిన చర్యలు చేపడతానన్నారు. రైల్వే లైను కోసం ఇళ్లు కోల్పోయిన బాధితులకు రూ.50 లక్షల వరకు అవసరం పడుతుందని ప్రభుత్వానికి నివేదించినట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, మాజీ అధ్యక్షుడు బోడసింగి సత్తిబాబు, క్లష్టర్ ఇన్‌చార్జిలు మిత్తిరెడ్డి ఈశ్వరరావు, పెద్దింటి మోహన్, మహిళా అధ్యక్షురాలు గేదెల మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గీతా జయంతి



సామూహిక గీతాపారాయణం చేస్తున్న భక్తులు

బొబ్బిలి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పూల్‌బాగ్‌లోని గీతా మందిరంలో గీతా మండపం కమిటీ ఆధ్వ ర్యంలో సంపూర్ణ గీతా పారాయణం చేశారు. గీతా మందిరం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పెంట స్వామినాయుడు, కర్రి రామినాయుడు, ప్రతినిధులు అల్లు స్వామినాయుడు, పాపారావు, ఆధ్యాత్మిక గురువు బొద్దూరు రాము, చెలికాని కేశవ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వికాస తరంగణి ప్రతినిధులతో కలిసి సుమారు వందమంది భక్తులు 701 శ్లోకాలను పఠించారు. తొలుత విద్యార్థులకు గీతా పారాయణ శ్లోకాల పోటీలను నిర్వహించారు. భగవద్గీతలోని ఐదో అధ్యాయం కర్మసన్యాస యోగంలో శ్లోకాల పఠనం పోటీల్లో వెలమల జెసితాదేవి, గురాన విష్ణుప్రియ, ఎ. అఖిలవర్మ ప్రథమ స్థానాలు సాధించారు. పునీత శ్రీచరణ్, నిహారిక, స్వాతి ద్వితీయ స్థానం పొందారు. రుషిత సాయి, చాతురి, ఝాన్సీలక్ష్మి శివసాయి తృతీయస్థానం సాధించారు. స్థానిక కంచరవీధి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో భక్తులు గీతాపారాయణం చేశారు. అనంతరం సాయంత్రం స్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే స్థానిక తారకరామా కాలనీలో మున్సిపల్ పాఠశాల హెచ్‌ఎం చిట్టిమోజు ఉషారాణి ఆధ్వర్యంలో విద్యార్థులు భగవద్గీత శ్లోకాల పారాయణం చేశారు.

పీజీఆర్ఎస్‌కు 27 వినతులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏవో సునీల్

సీతంపేట రూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పరిపాలనాధికారి సునీల్ 27 వినతులను స్వీకరించారు. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు మునిగిపోయిన వరి పంటకు నష్టపరిహారం అందించాలని సవర అప్పన్న కోరారు. మేకలు, గొర్రెల కొనుగోలుకు రుణం కావాలని సవర రాజయ్య అర్జీ అందజేశారు. పవర్‌టిల్లర్, ట్రాక్టర్ మంజూరు చేయాలని వీరయ్య, అప్పలస్వామి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏవోతో పాటు డిప్యూటీ ఈవో జి.రామ్మోహనరావు, ఏవో వాహిని, సీడీపీవో సిమ్మాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ నిర్మాణానికి స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్, అధికారులు

గుమ్మలక్ష్మీపురం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలో ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడానికి రూ.70 లక్షల వ్యయంతో చేపట్టనున్న వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సోమవారం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్థల పరిశీలన చేశారు. 90 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని ఇక్కడ చేపట్టనున్నారు. కార్య క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, వీఆర్‌వో రామారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గోపాల్, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో 'ఎయిడ్స్ డే'



ఎయిడ్స్ డే అక్షరాకృతిలో కూర్చొన్న విద్యార్థినిలు

సీతంపేట రూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం పూతికవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థినిలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు ఎయిడ్స్ డే అక్షరాకృతిలో కూర్చొన్నారు. అనంతరం పూతికవలసలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు సుశీల తదితరులు పాల్గొన్నారు.

సంకల్పం సడలిందా!

(ఐదో పేజీ తరువాయి)

కార్యకలాపాలను అమలు చేశారు. అభిమాని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు రెడ్డి రాజగోపాలనాయుడు ఎకో క్లబ్‌లు, గ్రీనరీ క్లబ్‌లను ఏర్పాటు చేసి సమాజంలోని అన్ని వర్గాల వారిని భాగస్వామ్యం చేశారు. మునిసిపాలిటీ చేపట్టే కార్యక్రమాలకు చేదోడువాదోడుగా నిలిచారు. అలాంటి బొబ్బిలిలో నేటికీ ప్రజలు వివిధ రూపాల్లో కాలుష్యాన్ని ఎదుర్కొం టున్నారు.

బొబ్బిలి పట్టణంలో మొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. ఇటు ప్రజలు రోడ్డు పక్క ప్రాంతాల్లో పెద్దఎత్తున చెత్తాచెదారాలను పారబోస్తున్నారు. విచ్చలవిడిగా కోళ్ల ఫారాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటి నుంచి వెలువడే వ్యర్థాలను చేపల చెరువుల్లో వినియోగిస్తున్నారు. దీనివల్ల ఇటు జల కాలుష్యం కూడా పెరుగుతోంది. బొబ్బిలి గ్రోత్‌సెంటరులో పచ్చదనం పెంచేందుకు ఖాళీస్థలాలు కేటాయించారు. అందులో నాటిన మొక్కలు ఏపుగా మారాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వాటన్నింటినీ గొడ్డలి వేటుకు గురిచేశారు. వాటి స్థానంలో కొత్తగా మొక్కలు నాటలేదు.

కాలుష్యం నివారణ పేరుతో భారీ అవినీతి

పరిశ్రమల్లో కాలుష్య నివారణ కోసం ప్రత్యేక యంత్రాలు వాడేందుకు విద్యుత్‌ను భారీ సబ్సిడీతో సరఫరా చేస్తోంది. ఆ విద్యుత్‌తో యజమానులు కాలుష్య నివారణకు చర్యలు తీసుకోకుండా తమ ఉత్పత్తులను పెంచుకొని లాభాలు ఆర్జిస్తున్నారు. ఈ ప్రక్రియలో అధికారులకు పెద్దఎత్తున మామూళ్లు అందుతున్నాయి. ప్రజల ఆరోగ్యం ఎలా పోయినా వారికి పట్టడం లేదు. ఇళ్లపై ప్రతిరోజూ చేరే దుమ్మును తొలగించుకునేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

-బెవర గణేశ్, యూత్ ప్రతినిధి, బొబ్బిలి

క్రీడల్లో ఆరికతోట విద్యార్థుల ప్రతిభ



రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ సాధించిన విద్యార్థులు

రామభద్రపురం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రస్థాయి అండర్-19 జూడో పోటీల్లో ఆరికతోట విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 55 కేజీల విభాగంలో వి.చినయోగానంద నాయుడు, 40 కేజీల విభాగంలో తూముల సంతోష్‌లు కాంస్య పతకాలు సాధించారని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బొత్స రత్నకిశోర్ తెలిపారు. గత నెల 28, 29, 30 తేదీల్లో సత్యసాయి జిల్లా ధర్మవరం మండలంలోని చిగిచర్ల పాఠశాలలో పోటీలు నిర్వహించారు. పతకాలను సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం గులిపల్లి కృష్ణవేణి, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కొవ్వొత్తులతో ప్రదర్శన



ఎన్టీఆర్ కూడలిలో నిర్వహిస్తున్న కొవ్వొత్తులతో ప్రదర్శన

బొబ్బిలి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం పురస్కరించుకుని సోమవారం రాత్రి స్థానిక ఎన్టీఆర్ కూడలిలో రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఆయా సంస్థల ప్రతినిధులు జేసీ రాజు, శ్రీహరి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో శివకాంత్, చిన్నారావు, రామకృష్ణ, నాగూరు రమేష్, జీసీహెచ్‌జీ శర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లె పండుగ పనులకు చెల్లింపులు

బొబ్బిలి రూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ పేరిట చేపట్టిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం రెండు రోజుల క్రితం చెల్లించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో చేసిన ఆయా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారు. బొబ్బిలి డివిజన్ లోని బొబ్బిలి, రాజాం, గజపతినగరం సబ్ డివిజన్ల పరిధిలో 13 మండలాలకు గాను రూ. 1003.95 లక్షలు విడుదల చేసినట్టు పీఆర్ ఈఈ రమణమూర్తి తెలిపారు. సంక్రాంతి నాటికి మిగతా పనులు పూర్తి చేసి బిల్లులు చెల్లించేలా చర్యలు చేపడతున్నామన్నారు. మార్చిలో చేసిన పనులకూ త్వరలో చెల్లిస్తామని చెప్పారు.

సమస్యలపై దృష్టిపెట్టండి

బొబ్బిలి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులు, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా సోమవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో మండల అధికారులతో మాట్లాడారు. ఒకే సమస్యపై రెండోసారి ఫిర్యాదులు అందకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.శ్రీను, ఎంపీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణం



పునాది స్థాయిలోనే నిలిచిన నిర్మాణం

బొబ్బిలి రూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): కమ్మవలసలోని వెల్‌నెస్ భవన నిర్మాణం నాలుగేళ్లుగా అసంపూర్తిగా నిలిచి ఉంది. గత ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతోనే పునాదుల్లోనే ఆగిపోయింది. నిర్మాణ వ్యయం పెరిగిపోవడం తదితర కారణాలతో కాంట్రాక్టర్ పనులు చేపట్టడం లేదు. ప్రస్తుతం కేంద్రం అద్దె ఇంట్లో నిర్వహిస్తున్నారు. ఈ విషయంపై పీఆర్ ఏఈ రాజశేఖర్‌ని వివరణ కోరగా.. ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు.

ఏఎన్ఎంపై చర్యలు తీసుకోండి

మక్కువ రూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): తూరుమామిడి ఆశా వర్కర్ గంట శ్రీదేవిపై దాడి చేసిన ఏఎన్ఎం లక్ష్మిపై చర్యలు తీసుకోవాలని ఆశా వర్కర్ల సంఘం నాయకులు వి.ఇందిర, శివాని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ప్రభాకర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత నెల 22న తూరుమామిడి సచివాలయంలో పనిచేస్తున్న ఏఎన్ఎం లక్ష్మి. ఆశా వర్కర్ శ్రీదేవిపై దాడికి పాల్పడంతో పాటు దుర్భాషలాడిందన్నారు. కొంతకాలంగా ఆశా వర్కర్‌ను ఏఎన్ఎం వేధిస్తోందని తెలిపారు. ఈ విషయం మక్కువ డాక్టర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఏఎన్ఎం లక్ష్మిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొల్లి గంగునాయుడు, మన్మథరావు, గొర్లి వెంకటరమణ, బంకురు సూరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థినిని అభినందించిన ఎమ్మెల్యే



జయంతిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

తెర్లాం, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థిని దువ్వ జయంతిని ఎమ్మెల్యే బేబీనాయన సోమవారం అభినందించారు. బూరిపేటకు చెందిన జయంతి నెమలాం ఉన్నత పాఠశాలలో చదువుతోంది. పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. మాక్ అసెంబ్లీలో జయంతి ఆకట్టుకునేలా ప్రశంగించిందని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ రైతు వెంకట మురళీకృష్ణ మృతి



బొబ్బిలి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఆదర్శ రైతు సాలా వెంకట మురళీకృష్ణ (72) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆయన ఆదర్శ రైతుగా పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డులు అందుకున్నారు. వరి పంటతో పాటు మా మిడి, చెరుకు తదితర ఉద్యాన పంటల సాగులో ఆయనకు మంచి అవగాహన ఉంది. కొత్తగా వచ్చే వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖాధికారులకు సైతం మురళీకృష్ణ తన అనుభవాలతో వారికి అవగాహన కల్పించేవారు. మురళీకృష్ణ తండ్రి సూర్యారావుకు వ్యవసాయ సహజ శాస్త్రవేత్తగా పేరుండేది. తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని మురళీకృష్ణ అటు అధికారులకు, ఇటు రైతులకు మార్గదర్శిగా వ్యవహరించేవారు. సాగునీటి వనరులు, వాటి నిర్వహణ వంటి అంశాలపై చాలా అనుభవం కలిగిన వెంగళరాయసాగర్ ఆయకట్టు సంఘం అధ్యక్షుడిగా రైతులకు సేవలందించారు.

వెంకట మురళీకృష్ణ నుంచి చాలా నేర్చుకున్నా: ఎమ్మెల్యే

వ్యవసాయం, సాగునీటిరంగాలకు సంబంధించి సాలా మురళీకృష్ణ నుంచి చాలా నేర్చుకున్నానని ఎమ్మెలల్యే బేబీనాయన అఅప్పానే. ఆయన మా రాజకుటుంబానికి అత్యంత ఆప్తులన్నారు. ఆయన మృతి చాలా బాధాకరం, ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. వెంకట మురళీకృష్ణ మృతిపై ఏం ఎసీ మాజీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు, జగన్నాథపురం సర్పంచ్ బొద్దల పద్మాసత్యనారాయణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

పింఛన్లతో భరోసా



పింఛన్ అందజేస్తున్న లక్ష్మునాయుడు

బాడంగి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): పింఛన్లతో వృద్ధులకు, వికలాంగులకు భరోసా కలుగుతుందని బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పింఛన్ల పెంపుదల చేసి వృద్ధులు, వికలాంగులకు భరోసా నిచ్చిందన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రెసిడెంట్ తెంటు రవిబాబు, సర్పంచ్ కండి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు దేవరాపల్లి శ్రీను, వైస్ ప్రెసిడెంట్ మరడాన గాంధీ, గుణుపూరు స్వామినాయుడు, అప్పలనరసమ్మ పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్‌కు యూనిఫాం అందజేత



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న ఎస్ఐ

బాడంగి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు యూనిఫాం దుస్తులను ఎస్ఐ తారకేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు కేవలం శారీరక శిక్షణే కాకుండా సేవ, క్రమశిక్షణ, నాయకత్వం, జట్టు స్ఫూర్తి వంటి విలువలను జీవితాంతం నిలబెట్టే శిక్షణ అన్నారు. యూనిఫాం అనేది విలువలకు ప్రతీక అన్నారు. ఉద్యోగ రిజర్వేషన్ కూడా ఉండడం వల్ల విద్యార్థులకు అదనపు లాభం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, స్కౌట్ మాస్టర్ కొల్లి ఈశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

బాడంగి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని మండలంలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యాస్ అందజేయకుండా గ్యాస్‌పై వంట చేయమనడం భావ్యం కాదన్నారు. ఉచితంగా గ్యాస్ పంపిణీ చేయాలన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. రూ.10 వేల జీతం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
మా అక్షరం - మీ ఆయుధం
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా, ఈ నెంబర్లకు సంప్రదించగలరు.
ACM : 9985411514, విజయనగరం : 9985411533
పార్వతీపురం : 9985403035, సాలూరు : 9492900300



కాలుష్య కాటు

(ఐదో పేజీ తరువాయి)

వాయు కాలుష్యం మరింత పెరిగింది. 15 లక్షల నుంచి 18 లక్షల వరకూ వాహనాలు ఉన్నాయి. అందులో ఐదు లక్షల వరకూ కాలం చెల్లినవే. వీటిని రహదారులపై తిప్పడం ఎంతమాత్రం మంచిది కాదు. అయినా సరే ఈ వాహనాల విషయంలో పోలీస్, రవాణా శాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్టు విమర్శలు ఉన్నాయి. మరోవైపు వాహనదారులు సైతం విధిగా తమ వాహనాలకు కాలుష్య నిర్ధారణ పరీక్షలు జరుపుకోవడం ఉత్తమం. కానీ నిర్దిష్ట కాలంలో వాహనాలకు పరీక్షలు చేయడం లేదు. ఇటీవల గ్రీన్ ఎనర్జీలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి వస్తున్నాయి. ఈ శ్రేణి వాహనాల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచడం చాలా ఉత్తమం.

నియంత్రించే మార్గాలివే..

కాలుష్య నియంత్రణకు ప్రధానంగా మొక్కల పెంపకం, చెట్లను సంరక్షించడం ఉత్తమం. జిల్లాలో ఏటా ఉపాధి హామీ పథకంలో మొక్కలు నాటుతున్నారు. వాటి సంరక్షణకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కానీ అవేవీ ఆశించిన స్థాయిలో ఫలితం ఇవ్వడం లేదు. యంత్రాంగం బాధ్యతగా దీనిని చేపట్టడం లేదు. జిల్లాలో విజయనగరం కార్పొరేషన్, బొబ్బిలి, రాజాం మునిసిపాల్టీలు ఉన్నాయి. నెల్లిమర్ల నగర పంచాయతీతో పాటు 12 మేజర్ పంచాయతీలు ఉన్నాయి. 777 పంచాయతీలున్నాయి. వీటిలో మొక్కలు నాటడమే కాదు. సంరక్షించే బాధ్యతలు తీసుకుంటే జిల్లాలో కాలుష్యాన్ని నియంత్రణలో తీసుకురావచ్చు.

- వాహనాల వినియోగాన్ని తగ్గించాలి. ప్రజారవాణాకు సంబంధించి గ్రీన్ ఎనర్జీ వెహికల్స్‌ను మాత్రమే వినియోగించడం ఉత్తమం. కాలం చెల్లిన వాహనాలను వాడకూడదు.
- మితిమీరిన ప్లాస్టిక్ వినియోగానికి అడ్డుకట్ట పడకపోతే మానవాళికి ప్రమాదకరం. ఉదయం దైనందిన జీవితం మొదలు రాత్రి వరకూ ప్లాస్టిక్ వినియోగాన్ని సమూలంగా నియంత్రించాలి. మునిసిపాల్టీలు, పట్టణాల్లో వ్యర్థాల నిర్వహణను సరిగ్గా చేయాలి. స్థానిక సంస్థలు దానిని ఒక బాధ్యతగా చేపట్టాలి.
- విద్యుత్‌తో పాటు ఇతర శక్తి వనరులు పొదుపు చేయాలి. ఎల్ఈడీ లైట్లను మాత్రమే వినియోగించాలి. ఎనర్జీ ఎఫిషియంట్ ఉపకరణాలను మాత్రమే వాడాలి.
- నీటిని పొదుపుగా వాడాలి. జల కాలుష్యాన్ని తగ్గించాలి. అది కావాలంటే ముందుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

ప్రజా సహకారంతోనే నివారణ

కాలుష్యం నియంత్రణకు ప్రజలు కూడా సహకరించాలి. ఇప్పటికే కాలుష్య నియంత్రణకు సంబంధించి తనిఖీలు చేపడుతున్నాం. అవగాహన కార్యక్రమాలు పెంచాం. మట్టి వినాయక విగ్రహాల పంపిణీ చేస్తున్నాం. నిబంధనలు పాటించని పరిశ్రమలు, సంస్థలపై చర్యలు తీసుకుం టున్నాం. ప్రజల సహకారంతోనే కాలుష్యాన్ని నియంత్రించవచ్చు.

-సరిత, జిల్లా కాలుష్య నియంత్రణ అధికారి, విజయనగరం